క్లుప్తంగా

ఉచిత యోగా తరగతులు ప్రారంభం


యోగాలో మెలకువలు నేర్పుతున్న గురువు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలో యోగా, ధ్యానంపై ఉచిత శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మర్షి పత్రీజీ దివ్య ఆశీస్సులతో కోరమాండల్ ఇంటర్ నేషనల్ సంస్థ , అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం (పెదగంట్యాడ) సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులలో గ్రామానికి చెందిన పలువురు పాల్గొని యోగాలో మెలకవులు నేర్చుకున్నారు. యోగా గురువులు అప్పలరాజు,జంగమయ్య పాల్గొన్న వారికి శిక్షణ ఇచ్చారు.

కనీస పెన్షన్ రూ. 9 వేలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న నూకరాజు


మల్కాపురం: వివిధ రంగాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకుడు నూకరాజు డిమాండ్ చేశారు. మల్కాపురంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం పెన్షనర్స్ సమావేశం జరిగింది. నూకరాజు మాట్లాడుతూ పెన్షనర్స్‌ను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. పదవీ విరమణ చెంది, వయసుపై బడిన తమ సమస్యలపై పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి


గోపాలపట్నంలో నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

గోపాలపట్నం: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జనవరి 18 నుంచి 22 వరకు జరిగే ఆల్ ఇండియా సీఐటీయూ మహాసభను జయప్రదం చేయాలని గోపాలపట్నం జోన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పి. సత్యనారాయణ కోరారు. ఈ మేరకు గోపాలపట్నం డివిజన్ పరిధిలో 10 సెంటర్లలో అరుణ పతాకాలను ఎగుర వేశారు. గోపాలపట్నంలో జోన్ ఉపాధ్యక్షుడు బలివాడ వెంకటరావు జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పి. అనసూయ, ఎం. వరప్రసాద్, బాలు. వై. వెంకరమణ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం


నూతనంగా నిర్మించిన స్విమ్మింగ్‌పూల్

విశాఖ స్పోర్ట్స్: తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో నౌసేనాబాగ్‌లో నూతనంగా నిర్మించిన స్విమ్మింగ్‌పూల్‌ను కమాండింగ్ చీఫ్ వైస్ అడ్మిరల్ బిశ్వజిత్‌దాస్ గుప్తా మంగళవారం ప్రారంభించారు. సెయిలర్స్ రెసిడెన్సీ కాలనీలో ఏర్పాటు చేసిన ఈ పూల్ నివాసితుల జీవన నాణ్యత పెంచేందుకు తోడ్పడుతుందని వైస్ అడ్మిరల్ పేర్కొన్నారు. ఇందులో వినోదభరిత అంశాలను నిర్వహించేందుకు అనువుగా ఏర్పాటు చేశారు.

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


హెల్దీ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

గోపాలపట్నం: మర్రిపాలెం హెల్దీ వాకర్స్ క్లబ్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం మర్రిపాలెం వుడా లేఅవుట్ గ్రీన్ బెల్టు వాకింగ్ ట్రాక్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర, కార్యదర్శి ద్వారకానాథ్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎన్నికైన వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నడక ఆరోగ్యానికి మేలు చేస్తుందన్న నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇంతకు ముందు వాకర్స్ క్లబ్ లేదని ఈ క్లబ్ ద్వారా మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. తక్కువ కాలంలో నడకపై ఆసక్తి కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా కె. నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి. సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా జి. శ్యామ్‌సుందరరావు, పి. స్వామినాయుడు, కార్యదర్శిగా జాకబ్, కోశాధికారిగా డి. లక్ష్మణరావు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా 101 గవర్నర్ శుభ, ఆర్‌సీ–5 లక్ష్మిరెడ్డి, కార్యదర్శి జ్యోతి, కోశాధికారి మహాలక్ష్మి, రాజాపాత్రుడు, నరవ రాంబాబు, వుడా కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించిన వేగం ప్రమాదకరం


ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొన్న ట్రాఫిక్ సీఐ

గోపాలపట్నం: పరిమితికి మించి వేగంగా వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడతారని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు అన్నారు. ఎన్‌ఏడీ సమీప రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో స్పీడ్ గన్ ద్వారా మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో అతి వేగంగా వెళుతున్న 123 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఇందులో 102 కార్లు, 2 ద్విచక్ర వాహనాలు, 1 ఆర్‌టీసీ బస్సు ఉన్నాయి. ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రతిరోజు ఉంటుందని తెలిపారు. ప్రమాదాల బారిన పడకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇబ్బంది పాల్గొన్నారు.

వాహనాల వేలం నేడు

మద్దిలపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్–3 స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు బుధవారం వేలం వేయనున్నామని సర్కిల్–3 ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీలోని స్టేషన్‌లో సాయంత్రం 4 గంటలకు వేలం వేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఉదయం స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్లాస్టిక్ వినియోగంపై జరిమానాలు


ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారికి జరిమానా విధిస్తున్న అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధిలో పలు వాణిజ్య దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ విక్రయిస్తున్న, వినియోగిస్తున్న వారికి జరిమానాలు విధించారు. జోన్–5 ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో మల్కాపురం పరిధిలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వాహించారు. వార్డు హెల్త్ అసిస్టెంట్ రవితో కలిసి మల్కాపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్ లైన్‌లోని పలు వాణిజ్య దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో ఉన్న ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని వారికి జరిమానాలు విధించారు. అనంతరం డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పలు అనర్థాలు ఎదురవుతాయన్నారు. ప్లాస్టిక్‌ను దూరం పెట్టి,క్లాత్, పేపర్‌లతో చేసిన సంచెలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

లలితాపీఠంలో సంకట హర చతుర్థి


లలితాపీఠంలో గణపతికి పూజలు చేస్తున్న అర్చకులు

అక్కయ్యపాలెం: సంకట హర చతుర్థి సందర్భంగా స్థానిక లలితాపీఠంలో మంగళవారం సాయంత్రం వినాయకుడికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. పీఠం అర్చకుల మంత్రోచ్చరణల మధ్య ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. గణేశ స్తోత్రం, వ్రత కథ చదివారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తంగా గణపతి హోమం నిర్వహించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ పాల్గొన్నారు.

దుర్గాగణపతి ఆలయంలో..

సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో అర్చకులు నటరాజన్ ఆధ్వర్యంలో సంకట హర చతుర్థి పూజలు చేశారు. ఆలయంలో గణపతి హోమం నిర్వహించారు.

ఏయూ హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

- అవసరమైన మరమ్మతులకు వీసీ ఆదేశం
- ఫార్మసీ హాస్టల్ నిర్వహణపై ప్రశంసలు


ఫార్మసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలోని శ్రీకృష్ణదేవరాయ హాస్టల్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు పలు మౌలిక వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. భవనంలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని చీఫ్ ఇంజినీర్ ఆర్.శంకరరావుకు సూచించారు. వర్సిటీలో హాస్టళ్లను విభజించి, పర్యవేక్షణ బాధ్యతలు యూనివర్సిటీ ఇంజినీర్లకు అప్పగించాలన్నారు. ప్రతి హాస్టల్‌లో కాలానుగుణంగా అవసరమైన మరమ్మతులు గుర్తించి, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. దీని వల్ల విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పన చేయడంతో పాటు భవనాలను దీర్ఘకాలం పరిరక్షించడం సాధ్యపడుతుందన్నారు. అనంతరం ఏయూ ఫార్మసీ కళాశాల విద్యార్థినుల హాస్టల్‌ను కూడా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వసతుల కల్పనపై ఆరా తీశారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. హాస్టల్ నిర్వహిస్తున్న విధానంపై ప్రశంసించారు. విద్యార్థినులకు ఉపయుక్తంగా మరిన్ని వసతుల కల్పన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.కె.ఎం.పవార్, సీఎస్‌వో మహ్మద్ ఖాన్, ఇంజినీరింగ్, హాస్టల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో బెల్టులు, సర్టిఫికెట్ల ప్రదానం


క్రీడాకారులతో ముఖ్య అతిథులు

కంచరపాలెం: యంగ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్టర్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటేలో క్రీడాకారులకు గ్రేడింగ్ బెల్ట్స్ టెస్ట్ నిర్వహించారు. మంగళవారం డీఎల్‌బీ గ్రౌండ్‌లో జరిగిన ఈ పోటీలో పసుపు రంగు నుంచి బూడిద రంగు బెల్ట్ వరకు ప్రతిభ ఆధారంగా క్రీడాకారులకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ అనేది ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుత బెల్ట్ నుంచి ఉత్తీర్ణులైన వారికి అప్ గ్రేడ్ బెల్ట్ అందిస్తామని చెప్పారు. నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు ముఖ్యఅతిథిగా హాజరై కరాటే పిల్లలకు బెల్ట్, సర్టిఫికెట్ అందజేశారు. ఏఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'కార్మిక ప్రజా గర్జన' విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న నిర్వహించనున్న కార్మిక ప్రజా గర్జనను విజయవంతం చేయాలని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటీకరణ నిర్ణయం వెల్లువడి రెండేళ్లు అవుతోందని, అప్పటి నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు, పోరాటాలు కొనసాగుతున్నాయన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కనిపించటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉక్కు త్రిష్ణ మైదానంలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, బి.ఎస్. రాజు, బీఎంకె నాయక్, జగదీష్‌కుమార్, గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితం లేని సింహాద్రి (63) అనే వ్యక్తిని అతని కుమార్తె త్రిసుర్ల అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం చేర్పించి, వెళ్లిపోయారు. ఆ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆ వ్యక్తి సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసిన దువ్వాడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని దువ్వాడ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

22 నుంచి రాజశ్యామల నవరాత్రి ఉత్సవాలు


ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య గురువరేణ్య కుమార స్వామిజీ

సీతంపేట: మాఘ మాసం సందర్భంగా రాజశ్యామల మాత నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకు ఎంవీపీ కాలనీ సెక్టార్–11లో నిర్వహించనున్నామని మాతా శారదా ఫౌండేషన్ చైర్మన్ ఆచార్య గురువరేణ్య కుమార స్వామీజీ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం పెదపూడి ప్రశాంత్‌కుమార్, మంచా మల్లేశ్వరి, శంకర్ దేవర, మును పల్లతో కలిసి ఉత్సవాల బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ దేవీ నవరాత్రి ఉత్సవాల మాదిరిగానే రాజశ్యామల మాత ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. రోజుకొక రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. నిత్యం అమ్మవారికి కుంకుమ పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తామన్నారు. ఈ ఉత్సవాలకు లక్ష మంది వరకు భక్తులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఘనంగా ధారోత్సవాలు ప్రారంభం


గోదాదేవికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం నుంచి ధారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఆలయం నుంచి తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారికి గంగధార జలాలతో అభిషేక సేవ నిర్వహించారు. అనంతరం అక్కడే ఉన్న పురాతన మండపంలో అమ్మవారిని వేంచేయజేశారు. విశేష ఆరాధన, తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. పాశుర విన్నప పారాయణాన్ని విశేషంగా పఠించారు. అనంతరం అమ్మవారిని పల్లకీలో ఆలయంలోకి తీసుకెళ్లి బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు కుమారాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఐక్య పోరాటాలతో విజయం


శిబిరంలో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనతో కార్మికులపై కక్ష గట్టిన కేంద్రప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి సభ్యుడు చలసాని శ్రీనివాసరావు అన్నారు. ఐక్య పోరాటాలతో విజయం సొంతమవుతుందని, అందరూ కలసికట్టుగా పోరాడాలని సూచించారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 698వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పలువురు బీఎఫ్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎన్.రామారావు, జె.రామకృష్ణ, యు.రామస్వామి, కారు రమణ, సీహెచ్ సన్యాసిరావు, మహాలక్ష్మినాయుడు, డి. శ్రీనివాస్ మాట్లాడారు. పోరాటం చేయడం ఇక్కడి ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో రామకోటేశ్వరరావు, మంత్రి రవికిరణ్, టి ఈశ్వరరావు, పివి నగేష్, అప్పారావు, నల్ల రవి, శ్రీనివాసరాజు, రొంగలి వెంకటరావు, సూర్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్లపై దుకాణాలు పెడితే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్..


దుకాణదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రధాన రహదారిలో దుకాణాల ముందు టేబుళ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహించే వారిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. వాహనాల పార్కింగ్‌కు అవకాశం లేకుండా దుకాణాలు ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం 'సాక్షి'లో 'రోడ్కెక్కిన వ్యాపారాలు'అన్న శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రోడ్లపై వాహనాల పార్కింగ్‌కు అడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసరావు దుకాణదారులను హెచ్చరించారు. ఇదే విధంగా కఠినంగా వ్యవహరిస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. అలాగే సెల్లార్ల ఆక్రమణలను కూడా తొలగించాలని కోరుతున్నారు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆశిస్తున్నారు.

శభాష్.. సుందరం

ఉచిత సేవలకు తగిన గుర్తింపు


ఆటో డ్రైవర్ సుందర్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవో శిరీష

గోపాలపట్నం: గోపాలపట్నం ఇందిరానగర్‌కు చెందిన సుందర్ ఆటో డ్రైవర్. ఇతను సేవ చేయాలన్న సంకల్పంతో తన ఆటోతోనే సేవలందించడం ప్రారంభించాడు. అందులో భాగంగా మార్గశిర మాసంలో కనకమహాలక్ష్మి ఆలయానికి వృద్ధులు, దివ్యాంగ భక్తులను ఉచితంగా తన ఆటోలో తరలించేవాడు. ఇది గమనించిన దేవస్థానం అధికారులు మంగళవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈవో శిరీష, దేవస్థానం చైర్ పర్సన్ కొల్లి సింహాచలం, అధికారులు రమణ, సూరిబాబు సుందర్‌కు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. తనకు ఇదెంతో స్ఫూర్తిదాయకమని సుందర్ సంతోషం వ్యక్తం చేశాడు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- కార్పొరేటర్ పీవీ సురేష్
- 60వ వార్డులో ఇళ్ల పట్టాల పంపిణీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న పీవీ సురేష్

మల్కాపురం: అర్హులందరికీ పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పీవీ సురేష్ అన్నారు. వార్డు పరిధిలోని పలు సచివాలయాల్లో లబ్ధిదారులకు మంగళవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఒక పక్క రాష్ట్రాభివృద్ధి,మరో పక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. వారి మాటలు పట్టించుకునే స్థితిలో ప్రజలు లేరన్నారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా వెనుకడుగు వేయకుండా ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రజలకు అన్ని పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు,సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ పాకెట్ డైరీ ఆవిష్కరణ


పాకెట్ డైరీని ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు


క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న మంత్రి రాజశేఖర్, కార్యదర్శి భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: షిప్‌యార్డ్ ఏఐటీయూసీ యూనియన్ ప్రతినిధులు ముద్రించిన నూతన సంవత్సర పాకెట్ డైరీ ని మంగళవారం ఆవిష్కరించారు. 61వ వార్డులోని గ్రామమండలి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాంద్రేగుల సత్యాంజనేయ, షిప్‌యార్డ్ సీనియర్ మేనేజర్ (హల్ షాప్), కో–ఆపరేటివ్ డైరెక్టర్ జి.రఘు, షిప్‌యార్డ్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శ భోగవల్లి హరి అతిథులుగా పాల్గొని డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ ముద్రించిన డైరీలో అత్యవసర సేవలకు సంబంధించిన ఫోన్ నంబర్లతో పాటు కార్మిక సంక్షేమానికి సంబంధించిన అంశాలు, కార్మిక హక్కులు, పీఎఫ్‌కు సంబంధించిన వివరాలు ఇలా పలు ముఖ్యమైన సమాచారం ఇందులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బి.సత్యానందం, గుడాల రాంబాబు, గోవింద్, మళ్ల చిన్నా, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ విడుదల

మల్కాపురం: ఐఎన్‌టీయూసీ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల మాజీ చైర్మన్ కె.బలరాం, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంత్రి రాజశేఖర్, భోగవల్లి నాగభూషణం విడుదల చేశారు. స్థానిక ఫంక్షన్ హాల్లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న వీరు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భారతదేశ ప్రజల సంపదలైన ప్రభుత్వ సంస్థలను బడా బాబులకు అమ్ముకుంటూ పోతుందని ఆరోపించారు. ఆ విధానాన్ని మార్చుకోకుంటే దేశ ప్రజల ఆగ్రహానికి బీజేపీ ప్రభుత్వం బలి కాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేవీ సివిల్ ఎంప్లాయిస్ మాజీ ప్రధాన కార్యదర్శి బీఎస్ ప్రకాష్, తాతారావు, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

- నిర్వాసితుల ఐక్య సంఘం డిమాండ్
- 36 గంటల నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభం


దీక్షా శిబిరంలో పాల్గొన్న నిర్వాసితులు, అఖిలపక్షాల నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ నిర్వాసితుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో అగనంపూడి కూడలిలో 36 గంటల నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. మంగళవారం ఉదయం 6 గంటలకు దీక్ష ప్రారంభించారు. అఖిలపక్షాల నాయకులు నెల్లి శ్రీనివాసరావు, కర్రి దశేంద్ర, జనపరెడ్డి నరసింగరావు, గవర సోమశేఖర్ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిర్వాసితులకు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, కె.పరంధామయ్య, జి.రామకృష్ణ, బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, దానబాల పైడికొండ, కరణం సత్యారావు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో నిర్వాసితుల ఐక్య వేదిక నాయకులు యు.అప్పారావు, జి.చిన్న, కె.జగదీష్, ఉక్కు కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు, శ్రమశక్తి ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.